క్లుప్తంగా

ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారం



వైఎస్సార్ సీపీ నాయకులతో ఎంపీ శ్రీధర్

దెందులూరు: దెందులూరులో గౌడ, రజక, తొగర, సామాజిక వర్గాల ఉమ్మడి శ్మశాన వాటికల ఆధునికీకరణకు నిధులు మంజూరుకు ప్రాధాన్యతా క్రమంలో కృషి చేస్తానని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. మంగళవారం ఎంపీ కార్యాలయంలో దెందులూరు మండల వైఎస్సార్ సీపీ జగనన్న సచివాలయ మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, వైఎస్సార్ సీపీ బీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సప్పా మురళీ, రామారావుగూడెం ఉపాధ్యాయులు కాలి రామారావు, రాజులపాటి మధు, పీ. సురేంద్ర తదితరులు ఎంపీ శ్రీధర్‌ను కలిశారు.

జీవన ఎరువులు వాడాలి

దెందులూరు: వరిలో రైతులు ఎరువులు తగిన మోతాదులో వాడాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కే.ఫణికుమార్ అన్నారు. మంగళవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు డీ.భావన, ఎం. శ్వేత, బీ.ప్రమీల, ఎం.లక్ష్మి, ఎస్.గిరిజా ఆధ్వర్యంలో వరి సాగులో మెళకువలు, పరిశోధన కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ వరిసాగులో ద్రవరూప జీవన ఎరువులు వాడటం వల్ల పిలకబాగా పట్టి మంచి దిగుబడి వస్తుందన్నారు. ఈనె దశలో ఉన్న వరి పంటలో పిలకలను లెక్కిస్తూ రైతులకు జీవన ఎరువులపై అవగాహన అవసరమని అన్నారు. అనంతరం ద్రవరూప జీవన ఎరువుల వాడకంపై వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు.

రైల్వే ట్రాక్ మరమ్మతులు

భీమడోలు: భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మత్తుల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ట్రాక్ అత్యవసర మరమ్మతులలు నేపథ్యంలో ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు మూసి వేస్తున్నట్లు సంబంధిత రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. ఈ మేరకు చేపట్టిన ట్రాక్ మరమ్మతులను సంబంధిత సాంకేతిక సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. ఈనెల 15వ తేదీ బుధవారం సాయంత్రం ట్రాక్ పనులు పూర్తి చేసి గేటు మీదుగా వాహనాల రాకపోకలకు అనుమతి ఇస్తారు. ప్రస్తుతం ట్రాక్‌పై బీటీ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు కుర్లెళ్లగూడెం, పాతూరు రైల్వే గేటుల మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి.

లాన్ టెన్నిస్‌పై శిక్షణ

దెందులూరు: లాన్ టెన్నిస్ విధులు, క్రీడా కౌశలం, వ్యాయామ అధ్యాపక విద్యార్థులకు కీలకమని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తాని యేల్ అన్నారు. మంగళవారం కళాశాలలో లాంగ్ టెన్నిస్ ఓరియంటేషన్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్ఐఎస్ కోచ్ కరీముల్లా మాట్లాడుతూ ఉదయం థియరీ, ప్రాక్టికల్ తరగతుల ద్వారా విద్యార్థులందరూ తర్ఫీదు పొందాలని క్రమశిక్షణ, నిరంతర సాధనతో విజయం సాధ్యమన్నారు. వైస్ ప్రిన్సిపల్ పీడీకేడీ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ శ్యామల, రమేష్, విజయలక్ష్మి ఉన్నారు.

భీమ నాగలింగేశ్వర స్వామి వార్షికోత్సవం

దెందులూరు: గాలాయగూడెంలో భీమ నాగలింగేశ్వరస్వామి 5వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు వివిధ పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. ఆలయ ప్రదక్షణ నిర్వహించి స్వామివారికి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి స్వామివారి కల్యాణం గ్రామంలోని పలువురు దంపతులు పాల్గొన్నారు.

గోరుముద్దపై సంతృప్తి

దెందులూరు: జగనన్న గోరుముద్ద విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ ఉజ్వల భవిష్యత్తు లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకమని సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, వైస్ సర్పంచ్ ఏనుగు హేమసాగర్ అన్నారు. మంగళవారం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం స్వర్ణలత, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌తో పాటు జగనన్న గోరుముద్దను విద్యార్థులతో కలిసి వారు రుచి చూశారు. నాణ్యత, రుచి పట్ల ప్రజాప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేసి ఉపాధ్యాయులను అభినందించారు.

ఈ- పంట నమోదు జాబితా ప్రదర్శన

ఉంగుటూరు: ఈ- పంట నమోదు జాబితాలో అభ్యంతరాలు ఉంటే రైతులు ఈనెల 19 లోపు ఆర్‌బీకేలలో తెలియజేయాలని మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఉంగుటూరు, నాచుగుంట, నీలాద్రిపురం కాగుపాడు, కైకరంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఆయన ఈ పంట నమోదు జాబితాలు వెల్లడించి, ప్రదర్శించారు. ఈ సందర్భంగా రైతుల సమావేశాలు ఏర్పాటు చేశారు. ఉంగుటూరు ఏఏ జాన్సి, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు ఆర్థిక ప్రోత్సాహకం

- దర్జీలు, నాయీబ్రాహ్మణులు, రజకులకు అండగా 'జగనన్న చేదోడు'
- ఈ పథకంలో లబ్ధిదారుడికి ఏటా రూ.పదివేలు అందజేత



పెదపాడులోని టైలరింగ్ షాపు



మండలంలోని అప్పనవీడులోని టైలరింగ్ షాపు

పెదపాడు: వెనుకబడిన తరగతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దర్జీలకు, రజకులకు, నాయీబ్రాహ్మణులకు ఆర్థిక సాయం అందించాలన్న విశాల దృక్పథంతో ప్రభుత్వం జగనన్న చేదోడు పథకం ద్వారా ఏటా రూ.10వేల ఆర్థిక సాయం అందిస్తోంది. షాపులు నిర్వహిస్తున్న రజకులకు నాయీబ్రాహ్మణులకు దర్జీలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటివరకు మూడుసార్లు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. ఒక్కొక్క లబ్ధిదారుని ఇప్పటివరకు రూ.30వేలు అందించింది. జూన్, డిసెంబరులో అర్హులను గుర్తించి ఈ పథకం అందిస్తున్నారు. దెందులూరు నియోజకవర్గంలో 960మంది టైలర్లు, 247 మంది నాయీ బ్రహ్మణులు, 454 మంది రజకులు మొత్తం 1,661మందికి రూ.10వేలు చొప్పున రూ.1.66 కోట్లు ఈ పథకం ద్వారా నగదు నేరుగా అందించారు. అర్హులందరికీ ఎలాంటి సిఫార్సులు లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేస్తున్నారు. అర్హతే ప్రామాణికంగా దుకాణం ఉన్న లబ్ధిదారులందరికీ ఈ పథకం వర్తింపజేస్తున్నారు. ఎవరైనా పథకాలు అందించడంలో చేతివాటం ప్రదర్శించినా, లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేసినా వారిపై చర్యలకు తీసుకునేందుకు అనుకూలంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఈ పథకం చేర్చకపోయినా బీసీలకు ఆర్థికంగా చేయూత అందించాలనే సదుద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. గత ప్రభుత్వం ఇస్త్రీ పెట్టె, మట్టి బాణలు కత్తెరలు, ఇద్దరు ముగ్గురికి ఇచ్చి చేతులు దులుపుకునేదని, ప్రస్తుతం అలా కాకుండా వారికి చేదోడు పథకం ద్వారా ఆర్థికంగా చేయూత నేరుగా అందిస్తున్నారని, లబ్ధిదారులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మండలం	దర్జీలు	నాయీ బ్రాహ్మణులు	రజకులు	మొత్తం లబ్ధిదారులు	చెల్లించిన నగదు
పెదపాడు	292	92	128	512	రూ.51,20,000
దెందులూరు	274	60	123	457	రూ.45,70,000
పెదవేగి	278	62	96	436	రూ.43,60,000
ఏలూరు	116	33	107	256	రూ.25,60,000
మొత్తం	960	247	454	1,661	రూ.1,66,10,000

అర్హులందరికీ పథకం వర్తింపు



దర్జీలు, నాయీబ్రాహ్మణులు, రజకులకు ఆర్థికసాయం అందించేందుకు చేదోడు పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అర్హులందరికీ ఈ పథకాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఏటా ప్రభుత్వం రూ.10వేలు అందిస్తోంది. అర్హులైన వారికి ఎవరికైనా పథకం వర్తింకపోతే సమీపంలోని గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలి. సమస్య పరిష్కారం అయ్యేలా వారితో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నాం. – ఎస్ నిర్మలజ్యోతి, మండల అభివృద్ధి అధికారి, పెదపాడు

చేదోడు పథకం మంచి పరిణామం



చిన్నప్పటి నుంచి టైలరింగ్ వృత్తి ద్వారా జీవనోపాధి పొందుతున్నాను. ప్రభుత్వం అందిస్తున్న చేదోడు పథకం ద్వారా దర్జీలకు ఆర్థిక సాయం అందించడం మంచి పరిణామం. గతంలో ఎన్నడూ ఇలాంటి పథకం లేదు. ప్రస్తుతం ఈ పథకం ద్వారా రూ.10వేలు అందిస్తున్నారు. దుకాణం అద్దె చెల్లింపులకు ఉపయోగపడుతోంది. ఈ పథకం దర్జీలు, నాయీబ్రహ్మణులు, రజక వృత్తిదారులకు చాలా ఉపయోగపడుతోంది. – ఏ ఈశ్వరరావు, టైలర్, పెదపాడు

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

- సీసీ కెమెరాలతో నిఘా
- నిమిషం ఆలస్యమైన నో ఎంట్రీ
- భీమడోలులో రెండు పరీక్షా కేంద్రాలు



భీమడోలులో వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో బెంచీలపై విద్యార్థుల హాల్ టిక్కెట్ల నంబర్ వేస్తున్న సిబ్బంది

భీమడోలు: నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సీసీ కెమెరా నీడలో బుధవారం ఇంటర్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసారు. ఒక్క నిమిషం అలస్యమైన పరీక్షాహాల్‌లోకి అనుమతించే ప్రసక్తే లేదని సంబంధిత అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్‌లను ఏర్పాటు చేసిందని అధికారులు చెబుతున్నారు. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది కూడా సీసీ కెమెరా నిఘాలో ఇంటర్ అధికారులు పరీక్షలు నిర్వహించునున్నారు. మండలంలోని భీమడోలులోని శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల, పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. భీమడోలు శ్రీవేంకటేశ్వర కళాశాలలో జూనియర్ ఇంటర్ 165 మంది, సీనియర్ ఇంటర్‌లో 175 మంది పరీక్షలు రాయనున్నారు. పోలసానిపల్లి గురుకుల బాలికల కళాశాలలో జూనియర్ ఇంటర్ 210 మంది, సెకండియర్ పరీక్షలకు 238 మంది పరీక్షలు రాస్తారు. ఈ కేంద్రాల్లో పోలసానిపల్లి, భీమడోలు, గుండుగొలను, గుణ్ణంపల్లి, ద్వారకాతిరుమలలకు చెందిన కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కళాశాలల్లో విద్యార్థుల హాల్ టికెట్లను వారికి కేటాయించిన బెంచీలపై మంగళవారం కళాశాల సిబ్బంది నమోదు చేశారు. ఒక్కొక్క గదిలో 20 మందికి ఒక ఇన్విజిలేటర్‌ను నియమించనున్నారు. గతేడాది వరకు సంబంధిత కళాశాలలకు చెందిన అధ్యాపకులను ఇన్విజిలేటర్లుగా నియమించగా ఈ ఏడాది ప్రభుత్వ ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లను నియమించారు. రెండు కేంద్రాలకు సుమారు 30 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. మాస్‌కాపీయింగ్‌కు ఎటువంటి అస్కారం లేకుండా ఇంటర్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఫ్యాన్లు, మంచినీటి సదుపాయాల వంటి మౌలిక వసతులను కల్పించారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

గణపవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపల్ ఎం.రఘు తెలిపారు. పరీక్షలు ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4వతేదీ వరకూ జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు, మంచినీటి సదుపాయం కల్పించామన్నారు. జూనియర్ ఇంటర్ 304 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 296 మంది హాజరుకానున్నారని తెలిపారు. వీరిలో జూనియర్ ఇంటర్‌లో 29 మంది, ద్వితీయ సంవత్సరంలో 51 మంది ప్రైవేటు విద్యార్థులున్నారని తెలిపారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు

పెదవేగి : మైనర్ బాల బాలికలు వాహనాలు నడిపితే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ హెచ్చరించారు. పెదవేగిలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనచోదకులకు జరిమానా విధించారు.

సీహెచ్‌సీలో వైద్యాధికారి గైర్హాజరు

- రాత్రివేళల్లో అందని వైద్య సేవలు
- రాష్ట్ర అధికారి తనిఖీలో వెల్లడైన వైనం



దెందులూరు సీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వరరావు

దెందులూరు: దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటరులో అనధికారికంగా వైద్యాధికారి డాక్టర్ నవీన్ విధులకు హాజరుకావడం లేదు. మరొక వైద్యాధికారి సుందర్‌ను నియమించినా ఆయన ఇంకా బాధ్యతలు తీసుకోలేదని వైద్యశాల సూపరింటెండెంట్ ప్రియదర్శిని వెల్లడించారు. మంగళవారం వైద్యశాఖ స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ పీ.నాగేశ్వరరావు సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన 30 పడకల వైద్యశాలను, ఆపరేషన్ థియేటర్, తాగునీరు, మందులు, రిజిస్టర్‌ను రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ తనిఖీ చేశారు. తనిఖీ అధికారితో సూపరింటెండెంట్ మాట్లాడుతూ జనవరి నుంచి విధి నిర్వహణకు డాక్టర్ నవీన్ హాజరుకావడం లేదని, మరో వైద్యాధికారిని నియమించినా ఆయన కూడా రావడం లేదని ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఏవీఆర్ మోహన్‌కు తెలియజేశామన్నారు. ఇద్దరు వైద్యాధికారులు ఆస్పత్రికి రావడం లేదని, రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని గుర్తించామని ఈ సమస్యను పరిష్కరిస్తామని ఎస్పీఓ పీ.నాగేశ్వరరావు అన్నారు. ఈ ఆస్పత్రిలో మొత్తం ఆరుగురు వైద్యులు సేవలందించాల్సి ఉంది. ప్రస్తుతం నలుగురు మాత్రమే ఇక్కడ వైద్య సేవలందిస్తున్నారు. కొత్తగా వచ్చిన వైద్యులు బాధ్యతలు చేపట్టిన తరువాత ఓపీ 300 పెరిగిందని, రోగులకు వైద్య సేవలు, పారిశుద్ధ్యం, వైద్యశాల నిర్వహణ, తాగునీరు, విద్యుత్‌ను సంతృప్తికరంగా అందించడంపై ఎస్పీఓ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్యులను, సిబ్బందిని ఆయన అభినందించారు. అనంతరం ఎస్పీఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ వైద్యశాఖలో కాయకల్ప గ్రామంలో ప్రధానంగా సీహెచ్‌సీలో వైద్యసేవలు, వైద్యులు, సిబ్బంది నిర్వహణ, భవనాల నిర్మాణం, నాణ్యత, పారిశుద్ధ్యం ప్రధానాంశమన్నారు. వీటిని తనిఖీ చేయడానికి అమరావతి నుంచి వచ్చానని ఏలూరు జిల్లాలో గతంలో విధులు నిర్వహించానని ఎస్పీఓ నాగేశ్వరరావు అన్నారు.

రికార్డుల సక్రమంగా లేకుంటే చర్యలు

భీమడోలు: డ్వాక్రా సంఘాల నిర్వహణ రికార్డులు సక్రమంగా లేని పక్షంలో సహించేది లేదని డీపీఎం (ఐబీ) ఈ.అనిత అన్నారు. భీమడోలు వైఎస్సార్ క్రాంతిపథం మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మండలంలోని గ్రామ సంఘాల ప్రతినిధులకు నిధుల వినియోగపు రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణపై వచ్చే నెల వార్షిక ఆడిట్ నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా అధికారుల బృందం రికార్డుల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎం పి.సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. డీపీఎం (ఐబీ) ఈ.అనిత, డీపీఎం (ఫైనాన్స్), పార్థసారధి, ఏపీఎం (ఐబీ) ఏసురత్నం రికార్డులను పరిశీలించి లోపాలను సరి చేసుకోవాలని పలు సూచనలందించారు. ప్రతి పైసాకు ఆడిట్‌లో లెక్క చూపాల్సిన బాధ్యత గ్రామ సంఘాల ప్రతినిధులు, సీసీలపై ఉందన్నారు. డ్వాక్రా సంఘాల పనితీరును సూచించే ఆడిట్‌లో లోపాలు లేకుండా రికార్డులను సరి చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 45 సంఘాల పరిధిలో 1,759 డ్వాక్రా సంఘాల సభ్యుల వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. సీసీ సిబ్బంది, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నులి పురుగు నివారణతో సంపూర్ణ ఆరోగ్యం



గుండుగొలను- 1 స్కూల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి, ఎంపీడీవో



నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తున్న మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరక్టరు పద్మావతి



నిడమర్రు జెడ్పీస్కూల్లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ఎంపీడీవో పీవీవీ ప్రకాష్

భీమడోలు: నులి పురుగుల మందుల నివారణ ద్వారా చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని గుండుగొలను పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి, ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గుండుగొలను, పూళ్ల పీహెచ్‌సీ పరిధిల్లో 1 నుంచి 19 ఏళ్ల లోపు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 15,570 మందిలో 14,588 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. 97శాతం నమోదైందని వైద్యులు తెలిపారు. గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని 42 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 42 అంగన్‌వాడీ కేంద్రాలు, మూడు కళాశాలలకు చెందిన 11,106 మందిలో 10,130 మందికి, పూళ్ల పీహెచ్‌సీలో 33 అంగన్‌వాడీ కేంద్రాల్లో, 29 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 4,464 మంది బాలబాలికల్లో 4,458 మందికి ఆల్బెండజోల్ వేశారు. గుండుగొలను-1 ఆదర్శ పాఠశాలలో చిన్నారులకు వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి, ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్ మాత్రలు వేసారు. పోలసానిపల్లి-14, అంజనేయనగర్ కేంద్రాల్లో ఐసీడీఎస్ పీవో కేపీ విజయలక్ష్మి అంగన్‌వాడీ చిన్నారులకు మాత్రలు వేసారు. డ్రాపవుట్స్‌కు ఈనెల 18న మాత్రలు వేస్తామని వైద్యాధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో వైద్యులు బి.లీలా ప్రసాద్, ఈ.కల్యాణి మహేశ్వరి, కె.ప్రసాద్, ఎంపీహెచ్‌సీలు పాల్గొన్నారు. ఉంటుగూరు మండలంలో పాఠశాలల్లో మంగళవారం ఉంగుటూరు ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఆంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కాగుపాడు, కైకరం పాఠశాలల్లో ఆయన పాల్గొన్నారు. కైకరంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ఏఎస్ఎంలు, కాగుపాడు పీహెచ్‌సీ డాక్టరు జోషి రాయ్, వీఆర్వో రమేష్, ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, హెల్త్ డిపార్టుమెంటు సిబ్బంది పాల్గొన్నారు.

దెందులూరు మండలంలో..

దెందులూరు: వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం దెందులూరు ఉన్నత పాఠశాల, సెయింట్ మెర్సి యూపీ పాఠశాల, పోతునూరు ఉన్నత పాఠశాల, కొవ్వలి ఉన్నత పాఠశాల, మేదినరావుపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్ఎంల ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఎంలు, ఏఎన్ఎంలు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఎంపీడీఓ ఏబీవీవీ లక్ష్మి, ఎంపీహెచ్ఈఓలు నాగరాజు, వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. నులిపురుగుల కారణంగా పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందని పెదవేగి ఎంపీడీవో జి. రాజ్మానోజ్ అన్నారు. మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణ (ఆల్బెండాజోల్) మాత్రలను పంపిణీ చేశారు. పెదవేగి, విజయరాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొన్నారు. ఎంఈఓ సీహెచ్ బుద్ధవాస్ పెదవేగి పాఠశాల హెచ్ఎం టి.ఎడ్వర్డు, విజయరాయి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్ మీనాకుమారి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం కోసమే ఆల్బెండజోల్

పెదపాడు: ఆరోగ్యవంతమైన పిల్లలకోసం వారిలో నులి పురుగులను నిర్మూలించాలని మహిళా శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు డైరక్టరు కే పద్మావతి తెలిపారు. పెదపాడు ఐసీడీఎస్ పరిధిలోని వట్లూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నులిపురుగు నివారణ మందును వేశారు. వట్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టరు భారతి, పెదపాడు ఐసీడీఎస్ అదనపు ప్రాజెక్టు ఆధికారి ఎంఎస్ రాజశేఖర్, నోడల్ అధికారి లలిత పాల్గొన్నారు.

నిడమర్రులో 81శాతం పంపిణీ

నిడమర్రు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో నిడమర్రు మండలంలో మంగళవారం నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 1నుంచి 19 ఏళ్ల లోపు చిన్నారులు, యువత 6,166 మందిలో 4,996 మందికి మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. నిడమర్రు జెడ్పీస్కూల్లో ఎంపీడీవో పీవీవీ ప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 18న మిగిలిన వారికి ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తామన్నారు. పెదనిండ్రకొలను జెడ్పీస్కూల్లో వైద్యాధికారి తేజశ్రీ పాల్గొని విద్యార్థులకు తగిన సూచనలు అందించారు. డాక్టర్ కె. భాగ్యశ్రీ, సీహెచ్‌వో సి. సంజీవ, పీహెచ్ఎన్ జె. మరియమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు ఉన్నారు.

ఆల్బెండాజోల్‌తో ఆరోగ్యం

గణపవరం: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఆరునెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌నాయుడు, ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం డీ వార్మింగ్ డే సందర్భంగా మండలంలోని 5, 559 పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. సీహెచ్‌వో జాలాదివిల్సన్, పీహెచ్ఎన్ వరలక్ష్మి, హెచ్‌వీ పద్మరాగం తదితరులు పాల్గొన్నారు.